రక్షణ లేని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

- విద్యుదాఘాతంతో పశువులు మృత్యువాత
- పట్టించుకోని సంబంధిత అధికారులు


సోమారం గ్రామ శివారులో ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందిన గేదె (ఫైల్)

తొర్రూరు రూరల్: వర్షాకాలం ప్రారంభం కావడంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, ఇంటి ఆవరణంలో ఉతికిన బట్టలు ఆరబెట్టుకోవడంలో ఆదమరిస్తే ప్రాణాలకే ముప్పు వాటిల్లనుంది. తొర్రూరు డివిజన్‌లో 31 సబ్‌స్టేషన్లు ఉండగా, 75,893 వేల మంది గృహ వినియోగదారులు, 41,278 వేల మంది రైతులు వ్యవసాయ వినియోగదారులుగా ఉన్నారు. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో రైతులంతా వ్యవసాయ పనుల్లో ఉన్నారు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు ట్రాన్స్‌పార్మర్లు, స్తంభాలు, ఎర్త్ వైర్లకు మనుషులు, పశువులు, మేకలు, గొర్రెలు తాకి మృతి చెందుతున్నాయి.

చర్యలు తీసుకోవాలి

ట్రాన్స్‌పార్మర్లకు చుట్టు ఏలాంటి రక్షణ కవాచలు (కంచెలు) లేకపోవడం, ఇంటి ఆవరణంలో ఉతికిన బట్టలను ఆరబెట్టేందుకు ఇనుప వైర్లను కట్టుకోవడం, కరెంట్ సరఫరాకు అతుకులు ఉన్న సర్వీస్ వైర్లను వినియోగించడం వంటివాటితోనే ఎక్కువగా ప్రమాదాలు జరుతున్నాయి. ప్రతి ఏడాది వర్షాకాల సమయంలోనే జిల్లాలో వందలాది మంది మనుషులు, పశువులు, మేకలు, గొర్రెలు మృతి చెందుతున్నాయి. విద్యుత్ అధికారులు పట్టించుకోకపోవడం వల్లనే ప్రమాదాలు జరుతున్నాయని వినియోగదారులు, రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబందిత అధికారులు, ప్రభుత్వం స్పందించి ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని విద్యుత్ వినియోగదారులు కోరుతున్నారు.

చదువుతో మనిషికి ఉన్నత స్థానం


విద్యార్థిని అభినందిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ రూరల్: చదువే మనిషిని ఉన్నత స్థానంలో నిలబెడుతుందని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. ఇటీవల విడుదలైన తెలంగాణ పాలిసెట్ (పాలిటెక్నిక్) ఫలితాల్లో స్టేట్ 5వ ర్యాంకు సాధించిన విద్యార్థి ముత్యాల పార్థసారథిని తన క్యాంపు కార్యాలయానికి పిలిపించుకుని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ.. ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో చదువు మానవ మనుగడకు, గౌరవానికి ప్రతీక అన్నారు. మానుకోట నుంచి స్టేట్ ర్యాంకులు రావడం మనందరికీ గర్వకారణమని, స్టేట్ ర్యాంకు సాధించిన పార్థసారథి విద్యార్థులకు స్ఫూర్తి అన్నారు. పార్థసారథి తల్లిదండ్రులు గీతావాణి, ప్రవీణ్ స్థానిక స్పెషల్ యూపీఎస్, గుండ్రాతిమడుగు పాఠశాలల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర బీసీ నాయకులు శంతన్ రామరాజు, గొర్రె చిట్టిబాబు, కమ్మగాని కృష్ణమూర్తి, ధరంసోత్ నారాయణ్ సింగ్, చుక్క శ్రీనివాస్ విద్యార్థిని అభినందించారు.

వ్యాధుల కట్టడికి చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న రంగయ్య

నెహ్రూసెంటర్: జిల్లా వ్యాప్తంగా వ్యాప్తి చెందుతున్న సీజనల్ వ్యాధుల కట్టడికి చర్యలు తీసుకోవాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు కందాల రంగయ్య అన్నారు. జిల్లా కేంద్రంలో సంఘ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలోని గ్రామాల్లో జ్వరాలతో ప్రజలు అవస్థలు పడుతున్నారని, ప్రతి గ్రామంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వర్షాకాలం ప్రజలను సీజనల్ వ్యాధుల నుంచి తప్పించేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో పరిశుభ్రత, ఫాగింగ్, బ్లీచింగ్, డ్రెయినేజీలు శుభ్రం చేయడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తూ వైద్య పరీక్షలు నిర్వహించేలా వైద్యాధికారులు చొరవ చూపాలన్నారు. ప్రజలు వ్యాధుల బారిన పడకుండా అధికారులు, వైద్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి ఇరుగు అనిల్, నాయకులు ఏరుగొండ ప్రవీణ్, ధారావత్ సంతోష్, మధు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధి కోసం 'చలో కలెక్టరేట్'

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం ఆగస్టు 2వ తేదీన సీపీఐ ఆధ్వర్యంలో జరగనున్న చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథిరెడ్డి సోమవారం పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బయ్యారంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, తొర్రూర్ డివిజన్ కేంద్రం అభివృద్ధి, డోర్నకల్ రైల్వే జంక్షన్ అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో నూతనంగా ఏర్పడిన మండలాలకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని, మండలాల్లోని కార్యాలయాలకు నూతన కొత్త భవనాలను నిర్మించి ఇవ్వాలన్నారు. మహబూబాబాద్ మున్సిపాలిటీకి వంద కోట్లు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కలెక్టరేట్ ముట్టడికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు హాజరవుతారని, పార్టీ నాయకులు, శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గత బీఆర్ఎస్ పాలనలో వేలాది ఎకరాల భూములను నాయకులు కబ్జా చేశారని, అక్రమంగా దౌర్జన్యంగా కబ్జా చేసిన భూములను పేదలకు పంచి ఇవ్వాలన్నారు. కబ్జాదారులపై క్రిమినల్ కేసులు పెట్టాలని తెలపారు.

విద్యకు బడ్జెట్ తగ్గించిన ప్రభుత్వాలు


మాట్లాడుతున్న నరసింహారావు

తొర్రూరు: విద్యకు బడ్జెట్‌లో అరకొర నిధులు కేటాయించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు అన్నారు. పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలో సంఘ నిర్మాణ సమావేశం నిర్వహించారు. నరసింహారావు మాట్లాడుతూ.. ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్, కాస్మోటిక్ ఛార్జీలు వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం పీడీఎస్‌యూ డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షుడిగా నందీశ్వర్, ప్రధాన కార్యదర్శిగా రామ్‌చరణ్, ఉపాధ్యక్షుడిగా లోకేష్, సహాయ కార్యదర్శిగా గణేష్, కోశాధికారిగా నరేందర్ ఎన్నికయ్యారు. సభ్యులుగా వీరన్న, సిద్ధు, రవీందర్, సాయి, సుమన్, రవీందర్, సాగర్ నియమితులయ్యారు.

ఉద్యోగులకు అంకితభావం అవసరం



పెద్దవంగర: ఉద్యోగులకు అంకితభావం అవసరమని బొమ్మకల్లు గ్రామస్తులు అన్నారు. మండలంలోని బొమ్మకల్లు పంచాయతీ కార్యదర్శి నరేష్ బదిలీ కాగా సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగులకు బదిలీలు సహజమేనని, ఎక్కడ పని చేసినా ప్రజల గుండెల్లో నిలిచేలా విధి నిర్వహన ఉండాలన్నారు. గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాడిశెట్టి సైదులు, శారద, మాజీ ఎంపీటీసీ పసుపులేటి వెంకట్రామయ్య, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు రెడ్డబోయిన గంగాధర్, కారోబార్ గిరగాని కుమారస్వామి, స్థానికులు గిరగాని ఐలయ్య, రంగన్న, సులోచనలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గొప్పది


రవీందర్‌ను సన్మానిస్తున్న సంఘం నాయకులు

మహబూబాబాద్ అర్బన్: సమాజంలో అన్ని వృత్తులకంటే ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు సంకా బద్రినారాయణ అన్నారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు మడుపు రవీందర్ పదవీ విరమణ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా బద్రినారాయణ హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థులకు రవీందర్ తన సొంత ఖర్చులతో నోట్‌బుక్స్ విద్యార్థులకు అందించి వారి చదువులకు సహకరించారన్నారు. విద్యతోపాటుగా విద్యార్థులను మహోన్నతంగా తీర్చిదిద్దారన్నారు. అనంతరం రవీందర్‌ను పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కోట కనకయ్య, కళ్లెం వెంకట్‌రెడ్డి, శ్రీధర్, రామకృష్ణ, రాంజీనాయక్, జగన్‌మోహన్ రెడ్డి, మహబూబ్‌అలీ, ఉమాదేవి, గీత, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రేపు 'చలో హైదరాబాద్'


మాట్లాడుతున్న రేషపల్లి నవీన్

మహబూబాబాద్ రూరల్/కేసముద్రం: సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ ఆవరణలో సోమవారం సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమావేశం ఏర్పాటు చేసి నవీన్ మాట్లాడారు. సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఈనెల 31న చలో హైదరాబాద్ కార్యక్రమం విజయవంతం చేయాలన్నారు. కార్మికుల ఎగుమతి దిగుమతి రేట్లు పెంచాలని, నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్మికులను శ్రమ దోపిడీకి గురిచేయకుండా ప్రభత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. హమాలీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంకాయలపాటి జక్కరయ్య, నాగేశ్వరరావు, ప్రభాకర్, సురేష్, వెంకన్న, నరసయ్య, సురేష్ పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ చేపట్టాలి

మరిపెడ రూరల్: విద్యాశాఖ అవినీతి, అక్రమాలపై తక్షణమే విచారణ చేపట్టిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవర్ధన్, ప్రభాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈసందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ.. మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు వచ్చిన దగ్గర నుంచి డీఈఓ కార్యాలయం మొత్తం అక్రమాల పుట్టగా మారిందని వారు ఆరోపించారు. అక్రమ డిప్యుటేషన్లతో పాఠశాలలో ఉండాల్సి కొందరు ఉపాధ్యాయులు డీఈఓ కార్యాలయానికి చేరి వారి ఇష్టారాజ్యంగా అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని దుయ్యబట్టారు. అదేవిధంగా మరిపెడ ఎంఈవోగా పని చేసిన పూల్‌చంద్ కాలంలో జరిగిన అక్రమాలు, అవినీతిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో సమాచార హక్కు చట్టం కింద ఎంఆర్సీ నిధుల వినియోగంపై వివరాలు ఇవ్వాలని కోరిన ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించాడన్నారు. పాఠశాలకు వెళ్లని కొందరు ఉపాధ్యాయులతో కుమ్మక్కై పెత్తనం చేస్తున్నారన్నారు. జిల్లా విద్యాశాఖ అవినీతిపై టీఎస్‌యుటీఎఫ్ ఆధ్వర్యంలో ఆగస్టు 3న జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయం ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని వారు కోరారు.

అధిక నిధులు కేటాయించాలి


మహబూబాబాద్ అర్బన్: మాట్లాడుతున్న దేవేందర్

మహబూబాబాద్ అర్బన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఈనెల 31న చలో అసెంబ్లీని జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోత్ దేవేందర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద సెంటర్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో దేవేందర్ హాజరై మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి 30శాతం నిధులు పెంచాలని, జాబ్ క్యాలెండర్ ప్రకటించి చట్టబద్ధత కల్పించాలని, ఖాళీల వివరాలను అసెంబ్లీలో ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలన్నారు. తక్షణమే విద్యాశాఖ మంత్రిని నియమించాలన్నారు. చలో అసెంబ్లీకి అధిక సంఖ్యలో విద్యార్థులందరు రావాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు సతీష్, సంతోష్, ప్రణయ్, అఖిల్, రాజేష్, జైపాల్, ప్రకాష్ తదితరలు పాల్గొన్నారు.

తొర్రూరు: పెండింగ్‌లో ఉన్న ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి గొడిశాల మనోజ్ సోమవారం తెలిపాడు. ఈ నెల 31న చలో అసెంబ్లీ విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఉడుత వేణు, మార్త వినీల్, వినయ్, సందీప్, సోమేష్ పాల్గొన్నారు.

విద్యుత్ కోతలతో అల్లాడుతున్న ప్రజలు


ఝాన్సీలక్ష్మి


గార్ల: మండలంలో అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని జెడ్పీటీసీ సభ్యురాలు జాటోత్ ఝాన్సీలక్ష్మి అన్నారు. సోమవారం గార్లలో ఆమె మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ అధికారులను హెచ్చరించినా, సీఎం ఆదేశాలను మండల విద్యుత్ అధికారులు బేఖాతరు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత రాత్రి సమయంలో 4 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు దోమలతో తీవ్రంగా ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. అసలే వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు విషజ్వరాలతో గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, దీనికి తోడు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటం విచారకరం అన్నారు. ఇట్టి విషయంపై విద్యుత్ ఏఈ మహేంద్రబాబు ను 'సాక్షి' వివరణ కోరగా గత రాత్రి వర్షానికి సబ్‌స్టేషన్‌లో ఇన్సులేటర్లు పగిలిపోవడం వలన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడిందన్నారు.

అనాథ బాలికకు ఆర్థిక చేయూత


చెక్కు అందిస్తున్న ఎఫ్ఎంఎంఎస్ఎస్ ప్రతినిధి

గూడూరు: మండలంలోని మట్టెవాడకు చెందిన ఓ నిరుపేద అనాథ బాలిక పదో తరగతి వరకు ప్రభుత్వ బాలసదనంలో చదువుకుంది. ఆ తరువాత ఇంటర్ లేదా నర్సింగ్ చదువుకోవాలనే ఉద్దేశంతో మానుకోట జిల్లా కేంద్రంలోని బాలరక్ష భవన్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ పర్సన్ డాక్టర్ నాగమణికి తన ఆర్థిక ఇబ్బందిని తెలిపింది. ఆమె వెంటనే ఆడపిల్లల అభివృద్ధికి సహకరించే తనకు తెలిసిన ఎఫ్ఎంఎంఎస్ఎస్ అనే స్వచ్ఛంద సంస్థకు బాలిక వివరాలు తెలిపి, నర్సింగ్ చదువుకోవడానికి అయ్యే ఖర్చు సహాయం చేయాలని కోరింది. అందుకు సంస్థ వారు స్పందించి వెంటనే బాలిక నర్సింగ్‌కు అవసరమైన రూ.13,250 చెక్కును డాక్టర్ నాగమని ద్వారా పంపించగా, సోమవారం బాలరక్ష భవన్‌లో చెక్కును బాలికకు అందించారు. ప్రాజెక్టు డైరెక్టర్ సహాయ, మేనేజర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రజలు సహకరించాలి


రోడ్డు పనులు చేయిస్తున్న వెంకన్న

మహబూబాబాద్: అభివృద్ధికి పనుల విషయంలో ప్రజలు సహకరించాలని మున్సిపల్ వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న కోరారు. మున్సిపాలిటీ పరిధిలోని 24వ వార్డులో గల వడ్డెర కాలనీతోపాటు పలు కాలనీల్లో వర్షాల కారణంతో రోడ్లు బురదమయంగా మారడంతో వైస్ చైర్మన్ సోమవారం రోడ్లకు మరమ్మతు పనులు చేయించారు. పెద్ద పెద్ద సమస్యలు ఉంటే సంబంధిత అధికారులకు, వార్డు కౌన్సిలర్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యశిబిరం

గంగారం: మండలంలోని జక్కన్నపల్లి తండాలో నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ ఫౌండర్ డాక్టర్ రవీందర్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. ఈప్రాంతంలో ఆర్ఎంపీ కూడా లేకపోవడం బాధాకరమన్నారు. మరిన్ని వైద్యశిబిరాలు నిర్వహించేలా చర్యలు చేపడుతామన్నారు.

సంక్షిప్త సమాచారం

నాయకులను కలుపుకొని పోవాలి

గార్ల: మండలంలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే గెలుపు కోసం కృషి చేసిన సీనియర్ కాంగ్రెస్ నాయకులకు ఎమ్మెల్యే వద్ద గుర్తింపు లేకుండా పోయిందని కాంగ్రెస్ అసమ్మతి నాయకులు వాపోతున్నారు. సోమవారం మండలంలోని పుల్లూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ అసమ్మతి సీనియర్ నాయకులు విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. దశాబ్దకాలంగా కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని పార్టీలో కొనసాగుతూ ఇటీవల జరిగిన ఎమ్మెల్యే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోరం కనకయ్య గెలుపు కోసం ఎనలేని కృషి చేశామని వారు పేర్కొన్నారు. మండలానికి ఎమ్మెల్యే వచ్చిన సమయంలో తమకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని వాపోయారు. ఇట్టి విషయాన్ని త్వరలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రేణు కాచౌదరి, సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి విన్నవించనున్నట్లు అసమ్మతి కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.


శుభకార్యాలకు అందుబాటులో ఆర్టీసీ బస్సులు

తొర్రూరు: వివాహాది శుభకార్యాలకు అద్దెకు ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉంచుతున్నట్లు తొర్రూరు డిపో మేనేజర్ పద్మావతి తెలిపారు. శుభకార్యాలతో పాటు విహార యాత్రలకు అద్దెకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సూపర్ లగ్జరీ బస్సులను ఆర్టీసీ అందుబాటులో ఉంచుతుందన్నారు. స్థానికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 99592 26053, 70321 82456 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ

కేసముద్రం: మండలంలోని సబ్‌స్టేషన్ జీపీలో తెలంగాణ ఆదాయపు పన్ను కమిషనర్ జీవల్ లాల్ పుట్టిన రోజు సందర్భంగా తండాకు చెందిన క్రీడాకారుడు వాంకుడోత్ తరుణ్‌నాయక్ సోమవారం పలువురు విద్యార్థులకు నోట్‌బుక్స్, పలకలను అందజేశాడు.

చీరల పంపిణీ



తొర్రూరు: సేవా కార్యక్రమాలకు చేయూత అందించాలని లయన్స్‌క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ రాజేందర్‌రెడ్డి అన్నారు. చీదర మహేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం డివిజన్ కేంద్రంలోని వేమన నగర్‌లో పేదలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు నవీన్‌కుమార్, జోన్ చైర్‌పర్సన్ రేగూరి శ్రీదేవి, ప్రతినిధులు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

డోర్నకల్: స్థానిక బైపాస్ రోడ్డులోని పెట్రోల్‌బంక్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. వెన్నారం గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రావు తన తల్లితో ద్విచక్ర వాహనంపై డోర్నకల్ వస్తుండగా పెట్రోల్‌బంక్ సమీపంలో గేదె అడ్డు రావడంతో వాహనం అదుపు తప్పి కిందపడటంతో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆటోలో ఖమ్మం తరలించారు.

వనభోజనాలు

తొర్రూరు రూరల్: ఆషాఢమాసం పండుగను పురస్కరించుకోని శ్రీ మార్కండేయ చేనేత యువజన సంఘం వారి ఆధ్వర్యంలో మండలంలోని పత్తేపురం గ్రామ శివారులోకి వనభోజనాలకు సోమవారం వెళ్లారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కందకంట్ల సోమశేఖర్, వనం మోహన్, కూరపాటి జగన్, చిలుకమారి భాస్కర్, పారిపెల్లి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఫాగింగ్

గార్ల: గార్ల పట్టణంలో దోమల నివారణకు సోమవారం రాత్రి పురవీధుల్లో ఫాగింగ్ కార్యక్రమం చేపట్టినట్లు పంచాయతీ కార్యదర్శి కిషన్ తెలిపారు.

పీరీల పండుగ

గార్ల: గార్లలో ముస్లిం సోదరులు కవిటి పీరీల పండుగ వేడుకలను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పీరీల పండుగ సందర్భంగా మెయిన్ బజారులో భక్తులతో సందడిగా తయారైంది.

పగిలిన పైపు.. నిలిచిన నీటి సరఫరా



డోర్నకల్: డోర్నకల్ పట్టణ సమీపంలో మిషన్ భగీరథ పైపు పగలడంతో సోమవారం డోర్నకల్‌తోపాటు పలు గ్రామాలకు తాగునీటి సరఫరా నిలిచింది. ఓ ప్రైవేటు నెట్‌వర్క్ సంస్థ ఆప్టికల్ ఫైబర్ కేబుల్ ఏర్పాటు కోసం రోడ్డు ప్రక్కన పొక్లెయినర్ యంత్రంతో తవ్వకాలు చేపట్టింది. ఆదివారం సాయంత్రం సమ్మర్ స్టోరేజీ సమీపంలో తవ్వకాలు జరుపుతుండగా భగీరథ పైప్‌లైన్‌కు సంబంధించిన డీఐ 300 పైపు పగిలింది. దీంతో పైపు నుండి నీరంతా వృథాగా పోవడంతో భగీరథ సిబ్బంది గొల్లచర్ల సమీపంలో వాల్వ్ మూసి నీటి సరఫరా నిలిపారు. దీంతో సోమవారం మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న పైపు పగిలిన ప్రాంతాన్ని పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపట్టాలని ఆదేశించడంతో మరమ్మతు పనులు చేపట్టారు.

క్లుప్తంగా

'అధికారుల ఆదేశంతోనే డిప్యుటేషన్లు'

మహబూబాబాద్ అర్బన్: గిరిజన శాఖలో ఆశ్రమ పాఠశాల, ఎస్టీ హాస్టల్‌లో డిప్యుటేషన్లు ఉన్నత అధికారుల ఆదేశానుసారంగా నియమించామని జిల్లా గిరిజన ఉప సంచాలకులు ఎం.ఎర్రయ్య సోమవారం తెలిపారు. జిల్లాలో ఉపాధ్యాయుల చివరి పని దినముల రోజున అందరి డిప్యుటేషన్లు రద్దు అవుతాయన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో పైఅధికారుల అనుమతి, ఆదేశాలతో డిప్యుటేషన్లు నిర్వహించామన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున్న, ఉద్యోగ, ఉపాధ్యాయుల బదిలీలు జరుగుతున్న క్రమంలో తాత్కాలికంగా బాద్యతులు ఇన్‌చార్జ్ ఇచ్చామన్నారు. ఎక్కడ కూడ ఎలాంటి అక్రమాలు జరగలేదని తెలిపారు.

ధర్నాను విజయవంతం చేయాలి

డోర్నకల్: జిల్లా విద్యాశాఖలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని టీఎస్‌యూటీఎఫ్ మండల అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ డిమాండ్ చేశారు. డోర్నకల్‌లో సోమవారం జరిగిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. డీఈఓగా రామారావు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి విద్యాశాఖ కార్యాలయం అక్రమాల పుట్టగా మారిందన్నారు. కార్యాలయంలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 3న చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు శివప్రసాద్, సోమనబోయిన శ్రీనివాస్, శంకర్, సాహెబ్‌అలీ, మారెడ్డి పాల్గొన్నారు.

భద్రాచలం ఆలయానికి నిధులు కేటాయించాలి

మహబూబాబాద్ రూరల్: అయోధ్య శ్రీరామ మందిరానికి అయితే ఎలాగ వేలకోట్లు ఇచ్చారో అదే విధంగా భద్రాచలం ఆలయన అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎంపీ పోరిక బలరాంనాయక్ అన్నారు. పార్లమెంట్‌లో సోమవారం ఎంపీ బలరాంనాయక్ మాట్లాడారు. మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పర్ధిలోని గోదావరి పరివాహక ప్రాంతం, తెలంగాణలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన భద్రాచలంలో 25 కిలోమీటర్ల మేర కరకట్ట నిర్మించేందుకు రెండు నుంచి మూడు వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని కోరారు. భద్రాచలం నుంచి దుమ్ముగూడెం వరకు 25 కిలో మీటర్ల వరకు గోదావరి నదికి ఇరువైపులా కరకట్టలు నిర్మించడానికిగాను ప్రత్యేక గ్రాంట్ విడుదల చేయాలని కోరారు.

యువమోర్చా అధ్యక్షుడిగా హర్షవర్ధన్



డోర్నకల్: బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడిగా బోరింగ్‌తండాకు చెందిన దేవావత్ హర్షవర్ధన్ నియమితులయ్యాడు. బీజేపీ మండల అధ్యక్షుడు బానోత్ గణేష్‌నాయక్ సోమవారం హర్షవర్ధన్‌కు నియామక పత్రం అందించారు.

కార్గో సేవలు సద్వినియోగం చేసుకోవాలి



కురవి: మండల కేంద్రంలో టీజీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో కార్గో సెంటర్‌ను కురవి పాయింట్‌లో ప్రారంభించారు. సోమవారం లాజిస్టిక్స్ వరంగల్ రీజియన్ సేల్స్ టీం లీడర్ ఎస్.రామయ్య, డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పి.నరేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్గో సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ రోడ్డుపై ప్రయాణం ఎలా?



నెల్లికుదురు: బురద రోడ్లపై ప్రయాణం ఎలా చేయాలని తండావాసులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మేచరాజుపల్లి గ్రామ శివారు తూర్పు చెరువు కట్ట చివర నుంచి శనిగకుంట తండా వరకు గల రోడ్డు చిన్నపాటి వర్షానికే బురదమయంగా మారుతోంది. ఈ దారి గుండా గిరిజనులు గ్రామానికి, మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వెళ్తూ ఉంటారు. తండా నుంచి ప్రభుత్వ పాఠశాలకు విద్యార్థులు వెళ్లడానికి నానా అవస్థలు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.